# దమయంతి

ఎవరో కొట్టి నిద్రలేపినట్లుగా మెళకువ వచ్చింది. ఎందుకో భయం భయంగా నిద్రలేచాను. ఏదన్నా క్రూరమృగం సమీపించిందా? ఏ విష జంతువైనా దాపురించిందా? అయితే మాత్రం? మహామహుడు నా భర్త, నలమహారాజు నాపక్కన వుండగా భయమేమిటి? ఏరీవారు? ఏరీ? ఏమండీ? ....ఎన్ని రకాలుగా పిలిచినా ఏం లాభం? పక్కన వుంటేగదా పలకడానికి!

ఇప్పుడేగదా మాట్లాడుకున్నాము. ఇది నలుదారులు కలిసిన స్థలం. ఇది దక్షిణాపథానికి దారి; ఇది విదర్భమార్గం; ఇది కోసలకు వెళుతుంది; ఇది ఉజ్జయిని తెరువు. ఎటు పోదాం అన్నారు. ఎందుకో చెబుతున్నారను కున్నాను. అడవులలో నాతో ఏం ఇడుమలు పడతావు, పుట్టింటికి వెళ్ళు, నీవు అయినా— అన్నారు నలమహారాజు. ఏడుపూ నవ్వూ వచ్చింది. అన్నట్లు మహారాజు అనగూడదు కాబోలు వారిని. మా రాజ్యంపోయి, మా ఐశ్వర్యం అంతరించి, మేం నిలవనీడలేక అడవుల పాలయ్యాం గదా మరి.

ఓ చెంప ఏడుస్తూనే, లాలనగా— 'పదండి మా పుట్టింటికి పోదాం.' అన్నాను.

పుష్కరుడితో జూదం అంటూ ప్రారంభించగానే ఎందుకో మన స్సులో రాయిపడినట్లయింది. అబ్బాయి ఇంద్రసేనుణ్ణి, అమ్మాయి ఇంద్ర సేననూ విదర్భకు మా పుట్టింటికి పంపించేశాను. మళ్ళీ అందరం ఒకచోట వుంటాం, మా రోజులు బాగుంటే. వారు అన్నారుగదా- "నేను రాను, సర్వస్వం పోగొట్టుకొని ఏ ముఖంతో అత్తవారింటికి వెళ్ళడం?" ఆమాటా నిజమే.

అయితే యీ మా మహారాజు ఎక్కడికి దయచేశారు? ఎక్కడికి వెళతారు నన్ను వొదిలిపెట్టి? వొదలరు. ఇందాకేగదా మరీ మరీ గట్టిగా చెప్పాను.... "భార్య దగ్గిరవుంటే, రోగార్తుడికి వైద్యుడూ ఔషధమూ దగ్గర ఉన్నట్లు. భార్యదగ్గర ఉన్నప్పుడు— ఎంతలేసి ఆపదలు వచ్చిపడ్డా, అవి వొచ్చినట్లే అనిపించవు" అన్నాను. పైగా, "నేను మీతోపాటుగా వుంటాను. అలసినప్పుడు, దాహం అయినప్పుడు, ఆకలివేసినప్పుడు, భార్యే గదా మనోవేదనను తొలగించేది అనీ అన్నాను. నేను మీకు అనుజీవితను,

అనువృతను, దయజూడవలసినదాన్ని, నన్ను విడిచి వెళ్ళకండీ," అనీ చెప్పాను. అట్లాగే అన్నారు. నిద్ర ముంచుకొని వస్తే - ఇట్లా. వొరిగాను.

ఇంతలోనే వారు నన్ను విడిచి వెళ్ళిపోతారా? పోరు. మరి ఏరీ? ఎక్కడికి వెళ్ళారు? ఒకవేళ— ఒకవేళ, ఏమిటో ఒకవేళ. నిజంగానే నన్ను విడిచి వెళ్ళారా? లేక, లేక, పక్కలను ఎక్కడనో దాక్కుని ఉడికిస్తున్నారా? అట్లాగయ్యుండదు. అడవి, అడవిలో యిలాంటి స్థితిలో సరసాలా పరాచకాలూ ఆడతారా? ఏమిటో మరి.

ఇదేదో దైవ వంచనగా వుంది చూస్తే. నిజంగా యిది దైవ వంచనేనా? అల్లాగే వుంది చూస్తే. ఈ దేవతలు ఎందుకో చిలిపి చేష్టలు చేస్తూంటారు. పులికి చెలగాటం, మృగానికి ప్రాణసంకటమూనూ. దేవతలు మాత్రం అంత అవ్యక్తులా? ఎందుకని యిట్లా పరీక్షచేస్తారు? ఏమో, ఎటూ నిర్ధరించుకోలేము.

పెళ్ళికి ఎందుకంత పని చేశారు. ఒక అమ్మాయి, ఒక అయ్యను పెళ్ళాడదాం అనుకుంది. ఆ అయ్య ఆ అమ్మాయినే పెళ్ళాడుదాం అనుకున్నాడు. ఇందులో వింతాలేదు, విశేషమూ లేదు. దేవతలు స్వర్గం నుంచి దిగివచ్చారు. పెళ్ళికొడుకునే తమకు దూతగా చేసి పంపారు వారు.

ఆ వరుడుకూడా తగుదునమ్మా అంటూ వచ్చి, ఆయన ఇంద్రుడు, ఈయన అగ్నిహోత్రుడు, ఈయన వరుణుడు, ఆ ప్రభువు యమధర్మరాజు, వారు నిన్ను వరింపారు అంటూ చక్కట్లు చెప్తాడా ?

"నేను నలమహారాజును తప్ప మరొకర్ని పెళ్ళాడను-" అన్నానని, దేవతలు, అంతవారు, స్వయంవర వేదికమీదికి నలరూపంతో వస్తారా? పెళ్ళి

కూతుర్ని అల్లరిపెడితే వారికి ఏం వొరుగుతుంది? ఏం బావుకున్నారు వారైనా యింతకీ?

ఓహో, యిదా దేవతలకు కోపకారణం? తమర్ని నేను వరించలేదని అలిగి, మమ్మల్ని యిలా సాధిస్తున్నారా? యిది తప్పకుండా దేవతలపనే. లేకపోతే, కన్నెత్తి చూడడానికి భయపడేవాడు, ఆ పుష్కరుడు, ఆయన వచ్చి— నిర్భయంగా జూదం ఆడదాం అని ఆహ్వానిస్తాడా? నలమహారాజు అంతవాడు, ఆడితే, ఆ పాడు జూదంలో— రాజ్యం పోవడమా? మా రాజ్యంలో మేము వుండలేకపోవడమా? మా రాజ్యం పొలిమేరలో మేము వుంటే— ఒక్కరు మమ్మల్ని పలకరించిన పాపాన పోకపోవడమా? చివరికి చెరువులలోని నీళ్ళుతాగి మూడురోజులు కటిక ఉపవాసాలు చేయవలసి రావడమా మేము?

ఆహా, విధి వంచన, ఎంత ప్రబలంగా పట్టుకుంది మమ్మల్ని దుర్విధి. ఇంతకీ— యీ మహారాజు ఏరీ? ఏమండీ.... ఏమండీ అని యీ అడవి అంతా ఎక్కడ వెదకగలను? నా గతేంకావాలి? నాగతి సరే. ఆడది పాపం అని ఎవరైనా జాలి తలుస్తారు. ఈ నలమహారాజు గతేమిటని.ఏమయ్యారు? ఎక్కడికి వెళ్ళారు. ఒక్కరూ, కానికాలంలో విధి క్రూరంగా వేటాడుతున్న కానికాలంలో, పాపం, ఒక్కరూ ఏమై పోతారోగదా. పలకరించేవారు, ఆదరించేవారు, ఆలకించేవారు, కనికరించేవారు, కరుణ చూపించేవారు లేకుండా, పక్కనే నిలబడి, తన కష్టసుఖాలు తమవిగా, తన బాధలు, బాధ్యతలు తమవిగా పంచుకుని కలిసి బరువు మోసేందుకు నేనుగూడా దగ్గర వుండనప్పుడు, పాపం, ఏమౌతారో.... కర్మ. ఏం చెయ్యను, అడవి అడవంతా గాలించడమేగద పని యింక నాకు.

అడివి చాలా అందంగా వుంటుందికాని, ఇప్పుడు నాకా, అందాలు చందాలు. చెట్టు చెట్టు వెదుకుతున్నాను. గుట్టగుట్ట వెదుకుతున్నాను. దొన దొన గాలించాను. దయగల మహారాజే, ధర్మపరుడే. ఆడితప్పనివాడే, నా మీద ప్రేమగలవాడే, నన్నుకాదని, విడిచి వెళ్ళారు. ఆః. కన్నీళ్ళుగూడా రానికాలం దాపురించింది. కర్మకాకపోతే, కట్టుకున్న బట్టల్నిగూడా పక్షులు ఎత్తుకునిపోతే– తెల్లబోయి చూచారాయన. దారిద్ర్యం పరమావధిని తల పైన ధరించారాయన. నా చీర చించి చుట్టుకున్నారాయన. పాపం, అడవు లలో, పాపం పండిన పంటలు యీ అడవులు- యీ అడవులలో ఏం ఏం ఇబ్బందులు పడుతున్నారో ఏమో ఆయన. ఆకలికి తాళలేని సుకుమారుడు ఆయన. ఏ చిన్న బాధనూ ఓర్చుకోలేని మనసు మెత్తనివాడు ఆయన. ఏ కాస్త అవమానాన్నీ సహించలేనివాడు ఆయన. ఏమౌతున్నారో, ఏమో.

ఏమిటిది, యిట్లా గట్టిగా కరుచుకుంది. మింగుతోంది. "ఓ నిషధ మహారాజా, నన్నేదో పాము, కొండచిలువల్లే వుంది, మింగుతోంది. రండి, రండి కాపాడండి–" అరిచాను, ఏడ్చాను. పాపం, ఎవరో వస్తున్నారు. పాం మింగేసింది. ప్రాణాలు పోవుగద కర్మ. పాం చచ్చిపడివుంది. ఎవరో వచ్చి దాని నోరు నరికారు. నన్ను బయట పడేశారు. ఏం అసహ్యంగా వున్నాను. దగ్గరే సరస్సు. స్నానం చేశాను. యివతల పడ్డాను.

ఎవడో పాపం, ఎరుకవాడు, పామును నరికి, నాకు ప్రాణదానం చేశాడు. కృతజ్ఞురాలిని. చేతులు జోడించి, తలవొంచి – నమస్కరించి, కృతజ్ఞురాలిని, అన్నాను, తండ్రిలాగా కాపాడాడని. పేదవాళ్ళం అంతకన్న ఏంచెయ్యగలం. పేదవాళ్ళకు మాటలే ఆస్తి మరి. విధి వంచన. నా మాటను నిమిషంలోనే నా మొహాన విసిరికొట్టింది. అతనెవరో ఎరుక, పిచ్చిగా చూడటం మొదలుపెట్టాడు. వాగుడు ప్రారంభించాడు.

అంటరాని, దగ్గిరకి రారాని, తేరి చూడరాని నన్ను, ముద్దుమాటలు పలకడం ప్రారంభించాడు. దేవతలు, యిలాంటి పనేచేసి వారి వారి చోట్లకు దయచేశారు. అరికాలిమంట నెత్తికెక్కింది నాకు. కోపం తలకెక్కింది. కాల్చేట్టు చూచాను. పాపం ఆ ఎరుక, అక్కడకక్కడ అప్పుడప్పుడు నిలువునా చెట్టు విరిగిపడ్డట్టు పడి చనిపోయాడు.

మా నలమహారాజు యీ అడవిలో లేరు. ఉంటే - ఇంత జరుగుతూంటే—తెలిసి రాకపోరు. వారు ఎక్కడికో గంపెడు దిగులుతో వెళ్ళారు. పాపం ఏమౌతున్నారో ఏమో. మళ్ళీ అన్వేషణ. ఎక్కడా మా మహారాజు అడుగుజాడైనా కనిపించలేదు. భీకరారణ్యాలు, సూర్యరశ్మి గూడా చొరరాని అరణ్యాలలో పడి తిరుగుతున్నాను. ఎదుట ఓ మునిపల్లె. మహాతపశ్శాలులైన మునీశ్వరులు. వెళ్ళి వారికి నమస్కరించాను. ఎవరు నీవన్నారు. చెప్పాను. ఏడ్చాను. వారు దయచూపారు. దివ్యముఖదృష్టితో చూచారు.

కొద్దికాలంలోనే మీరు కలుసుకుంటారు. మీ రాజ్యం మీకు తిరిగి వస్తుంది అన్నారు. మనుకారం వర్జించిన మహనీయులమాట దబ్బరకాదు, కాని, కొదికాలం అంటే? మనం లెక్కించుకొనేట్లేనా, లేక, అనంతమైన కాలంలో, అపరిమితమైన జన్మల్లో ఏదో, ఎప్పుడో ఒకప్పుడు అనా అర్థం? ఏమైతే మాత్రం చేయగలిగింది ఏమివుంది. వారు దీవించారు. అంతేచాలు. అదే పదివేలు. దారికి అడ్డంపడి పోతున్నాను.

చనుప.

మా నలమహారాజును మీరెవ్వరన్నా చూచారా అని అడిగాను. నా ఆకారం నాకే భారంగా వుంది, నిజం. వారిలో కొందరు, పిచ్చిది అన్నారు.

నన్ను చూచి, కొందరు పిశాచం అన్నారు. కొందరు గేలిచేశారు. కొందరు పకపకా నవ్వారు. వారు చేదిపురానికి వెళుతున్నారట. వారితో కలిశాను. వారిని బతిమాలి వారి వెంట రావడానికి ఒప్పించగలిగాను. ప్రయాణం చేస్తున్నాం. అర్ధరాత్రి ఓ పెద్ద చెరువుదగ్గర ఆగాం. అందరూ నిద్రిస్తున్నారు. మనస్సు మాడుతూన్న మహారణ్యం లాగుంది. నాకు నిద్ర ఎట్లా వస్తుంది? ఏనుగులు వచ్చినై. నీరు తాగినై. వాటిలో కొందరలో అని, కొందర్ని తొక్కి చంపినయ్. చనుపలోనివారు బిగ్గరగా అరవడం మొదలెట్టారు.

అరుపులు విని పోతూ పోతూన్న ఏనుగులు తిరిగి వచ్చి మిగిలిన వాళ్ళను పట్టుకుని-భయంకరంగా ఎత్తి, నేలను పడేసి బాది చంపినయ్. బతుకుదామో, అనుకున్న వారినేమో చంపినై. చావురాదేమా నాకు! అని ఏడుస్తున్న నన్నేమో వదిలి వెళ్ళినయ్. బ్రతకడం అంటే బాధలు పడడం అని అర్థం కాబోలు.

మళ్ళీ ఒంటరిదాన్ని అయ్యాను, ఆ కాస్త తోడుగూడా లేదు. అల్లాగే ధూళికప్పి, జుట్టు అట్టలు కట్టి, మాసి మంగలం లాగైన వలువతో, నిద్రాహారాలులేక - పిచ్చి కళపడి, ఒక్కతైను దారిని పడిపోతున్నాను. నా మొహానే యిన్ని యిబ్బందుల్ని వ్రాశాడే విధి; పాపం, ఆ నలమహారాజు ఏం బాధలకు పాల్పడుతున్నారో ఏమో.

చేదిపురం ట అది. దారిన పడిపోతున్న నన్ను, ఎవర్తో వచ్చి ఆపింది. తనతో రమ్మంది. రాజమాత పిలుస్తున్నారంది. వెళ్ళాను. ఆ చల్లని తల్లి ఆదరించింది. తన దగ్గిర వుండమంది. నా మాటలు వింది. నేను సైరంధ్రినన్నాను. ఆమె అంగీకరించింది. గౌరవంగా చూచింది. అతకని గౌరవం భయంకరంగా వుంటుంది.

గతిలేక అక్కడే వున్నాను. ఆ రాజమాత, తన కుమార్తె సునంద అనే ఆమెతో నాకు స్నేహం కలిపింది. కాలం నెమ్మదిగా, బరువుగా, బండరాళ్ళలాగా, బాధగా, భయం భయంగా; వెలితిగా గడుస్తూంది. సుదేవుడుట ఎవరో బ్రాహ్మణుడు, వచ్చాడు. నన్ను తేరిపార జూచాడు. "ఈమె దమయంతి అన్నాడు. ఎవరీయన? ఎట్లా నన్ను గుర్తుపట్టాడు? ఆయనే చెప్పాడు— అమ్మా, నీ తోడబుట్టినవారి స్నేహితుణ్ణి. మీ వారందరూ క్షేమంగా వున్నారు. నిషధదేశంలో మీకు జరిగింది మీ తండ్రిగారు విన్నారు. మీరు వస్తారేమో అని చూచారు. ఇప్పుడు మిమ్మల్ని వెతికిస్తున్నారు— అన్నాడు." నేను వెక్కి వెక్కి ఏడ్చాను. నిగ్రహించుకోలేకపోయాను. ఆ సుదేవుడు, నా భ్రూమధ్యంలో పద్మరేఖలను చెప్పి రుజువు చేశారు. అప్పుడు తెలిసింది, రాజమాత ఎవరోకాదు, నాకు పినతల్లి అవుతారామె అని. విదర్భకు చేరాను. మాతల్లి నిలూనా నీరయింది నన్నుచూచి. అల్లుణ్ణి వెదికించడం పూర్తికాలేదు. నాకూ జీవితంమీద విరక్తి పుట్టింది. ఈ బ్రతుకు చాలు అనిపించింది. అమ్మతో చెప్పాను. తండ్రిగారు మరికొందర్ని మళ్ళీ పంపిస్తున్నారు, నలమహారాజును వెతకడానికని. నేను కొన్ని మెళకువలు చెప్పాను. పర్ణాదుడనే భూదేవుడు వచ్చి చెప్పాడు, నా మాటకు అయోధ్యలో సమాధానం వచ్చిందట. ఋతుపర్ణమహారాజు వంటలవాడు సమాధానం యిచ్చాడట. సుదేవుణ్నే మళ్ళీ అయోధ్యకు పంపాము. దమయంతి పునస్స్వయంవరం— అని చెప్పమన్నాం. రేపు, లేదు, ఎల్లుండే అని చెప్పమన్నాం. సుదేవుడు అట్లాగే చెప్పాడు. ఋతుపర్ణుడు రథంమీద మర్నాటికి అయోధ్యనుంచి విదర్భకు వచ్చారు. ఆ రథఘోషం వినగానే తెలిసింది నలమహారాజు రథం అని.

నలమహారాజుకు అశ్వహృదయం తెలుసు. ఆ రథధ్వని మరొకరిది కాదు. తీరాచూస్తే ఎవరో. నలమహారాజు కానేకాదు. ఋతుపర్ణుడికి తండ్రిగారు మర్యాదచేసి విడిది చూపించారు. ఋతుపర్ణుడితో బాహుకుడు అనేవాడూ

వచ్చాడు. అందవికారానికి పెట్టింది పేరు అన్నారెవరో, సర్వావలక్షణాలూ ఉన్నాయిట. పాలు విరిగినట్లయింది నా మనస్సు. ఐనా, చూచిరమ్మని కేశిని పంపాను. అది నాకు కావలసింది.

కేశిని వెళ్ళి బాహుకుణ్ణి మాటలలోకి దింపింది. నలమహారాజు ప్రసక్తి తెచ్చింది. భార్యను అడవిలో నిర్దయగా వదిలిపెట్టడం చెప్పింది పాపం, ఆ బాహుకుడు విని కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడట. ఒకవేళ, బాహుకుడే, నా భర్తా? అ-బ్బ. ఎక్కడో, కానిదేశంలో, ఒక మహారాజుకు వంటలవాడుగా కాలం గడిపారా యింతకాలం. మూడు సంవత్సరాలు ముప్పు తిప్పలూ పడ్డారా నలమహారాజు.

ఇంద్రసేనుణ్ణీ, ఇంద్రసేననూ బాహుకుడి దగ్గిరికి పంపాను. బాహుకుడు వాళ్ళనుచూచి కిందా మీదా అయ్యాడుట. బాహుకుణ్ణి నెమ్మదిగా అంతఃపురానికి రప్పించాము. ఎంత ధైర్యంగా వచ్చాడని.

విజనం ఐన అడివిలో, నిద్రపోతూన్నదానిని, అనువ్రతను, అబలను, అగ్నిసాక్షిగా పెళ్ళాడిన దానిని వదిలి వెళ్ళినవారు, నలుడు తప్ప మరొకరులేరు అన్నాను మాటలలో. కావాలనే అన్నాను. ఆ మెత్తని మనస్సు నొచ్చుకుంటుందని తెలిసిగూడా అన్నాను. ఆగలేకపోయి అన్నాను. ఏడుస్తూ అన్నాను. కన్నీరు తుడుచుకోలేదు, కన్నీటి ధారలమధ్య అన్నాను.

బాహుకుడు నిదానంగా చూచాడు. "కలివచ్చి నామీద కెక్కింది. నా బుద్ధి పట్టు తప్పింది. అందుచేత వదిలాను. బహుబాధలు పడి కర్మను అనుభవించాను. తపస్సు చేశాను. నీవూ దుఃఖ భారంతో కర్మను అనుభవించావు. ఇదుగో యిప్పుడే కలి నన్ను విడుస్తున్నాడు. అందుకే యిక్కడికి వచ్చాను...." అన్నారాయన.

"సరేగాని, నన్ను అగ్నిసాక్షిగా పెళ్ళాడినదానివి, అనురక్తుణ్ణి, కాదని— మరో ఆపేక్షతో తిరిగి స్వయంవరం ఏర్పాటు చేయడం భావ్యంగానే ఉందా?" అన్నారు.

"మిమ్మల్ని రప్పించడానికే" అన్నాను. నా ప్రాణాలు గిలగిలలాడుతున్నయ్. "నా మనస్సులో మరో పాపభావం వుంటే, మిమ్మల్ని తప్ప మరొకర్ని ధ్యానిస్తే, స్మరిస్తే— కర్మసాక్షులు అయిన దేవతలు నన్ను యీక్షణం చంపివేయరా—" అన్నాను.

ఆకాశంనుంచి దివ్యవాక్కు వినబడింది. "ఈమె పలికింది నిజం. దేవతలు ఈమెను కాపాడారు" అని. నలుడు, కర్కోటకా అని ధ్యానించారు. పైనుంచి బట్టలు పడినయ్. నలమహారాజు వాటిని ధరించారు. మరుగుజ్జు, మరకాళ్ళు, చప్పిదవడలు, మిడిగ్రుడ్లు, పిచ్చిచూపులు, వెర్రివాలకం పోయింది. పొగలోనుంచి అగ్నిహోత్రుడులాగ నలమహారాజు నిలిచారు. ఎంతకాలానికి కళ్ళబడ్డారు.

మునిపల్లెలోని మునుల మాటలు నిజం ఔతున్నాయి.

కొంతకాలం వున్నాం.

కొద్దిపాటి పరివారంతో వారు నిషధకు వెళ్ళారు. పుష్కరుడితో మళ్ళీ జూదం ఆడారు.

గెలిచారు.

మా రాజ్యం మాది అయింది. మునులమాట నిజం అయింది.

అబ్బ, జీవితం అంతా పరీక్షగానే అయింది మాకు.